## విక్రుతమాల ప్రభుత్వ భూమిలో సర్పంచ్ తండ్రి అక్రమంగా నిర్మాణాలు.!

1.60 సెంట్లలలో నిర్మితమవుతున్న నిర్మాణాలు...

పట్టించుకోని అధికారులు.!



-4లో

పెన్ పవర్
రాయలసీమ
తిరుపతి । చిత్తూరు । అన్నమయ్య । వై.ఎస్.ఆర్ కడప । నంద్యాల । కర్నూలు । అనంతపురం

## మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు అవినీతి పై న్యాయ విచారణ జరపండి.

రాజీవ్ నగర్ లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన మాజీ ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి.

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ.



**పెన్ పవర్ – శ్రీ కాళహస్తి ప్రెస్ క్లబ్, జూలై 09:**

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడబెట్టిన అక్రమాస్తులు, సాగించిన అవినీతి, అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. తాను అధికారంలోకి వస్తే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతానని ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. శ్రీ కాళహస్తి ప్రెస్ క్లబ్ నందు మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీస్, రెవెన్యూ, ఆలయం, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులను దళారులుగా మలుచుకుని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సాగించిన అవినీతి దందాకు హద్దే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడి, బడి, ఇసుక, మైనింగ్, భూ దందాలు చేయడానికే ఆయన ఎమ్మెల్యే అయినట్లు వ్యవహరించారని విమర్శించారు. అవినీతి ఎమ్మెల్యేలకు బిరుదులు కేటాయిస్తే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి నెంబర్ వన్ అవినీతి చక్రవర్తి' అనే గొప్ప బిరుదివ్వచ్చని ఎద్దేవా చేశారు. జగన్న కాలనీల పేరిట వందల కోట్ల అవినీతి చోటు చేసుకుందనీ, మాజీ ఎమ్మెల్యే, ఆయన బంధువులు, అనుచరులు కలిసి రైతుల పొట్టగొట్టారని ఆరోపించారు. ఆయన పీఏగా వ్యవహరించిన గుణశేఖర్ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించి పెద్ద ఎత్తున అక్రమాస్తులు కూడ గట్టారనీ, ఆయనపైన కూడా విచారణ జరిపి ఉపాధ్యాయ విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత ఐదేళ్లలో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుందనీ, ముఖ్యంగా వెండి నిల్వలు, కొనుగోళ్లు, నాగపడగల విషయంలో మాజీ ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వెండి నిల్వలు, కొనుగోళ్లపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రైవేట్ పరిశ్రమలతో కుమ్మక్కై రూ.కోట్లు ఆర్జించారన్నారు. ఫలితంగా అటు ప్రజలు, ఇటు కార్మికులు తీవ్రంగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాంకో పరిశ్రమ చేసిన చిందేపల్లి రోడ్డు అక్రమణను ఈ సందర్భంగా ఉదహరించారు. ఎమ్మెల్యేగా దిగిపోతూ కూడా రాజీవ్ నగర్ లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారనీ, ఆ భూమిని స్వాధీనం చేసుకోకుంటే తామే పేదల సమక్షంలో జెండాలు పాతి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఆయన పీఏ గుణశేఖర్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటరత్నం కూడా మాజీ ఎమ్మెల్యే, ఆయన పీఏ అవినీతిపై విచారణ జరపాలని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు మోహన్ నాయుడు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచండి

### మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయండి

**పెన్ పవర్, నంద్యాల , జులై 09:**ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో విద్యా వ్యవస్థ పనితీరుపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్ ను సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఫలితాల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి అలసత్వం లేకుండా మెనూ తప్పనిసరిగా పాటిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మెనూ ఛార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించడంతో పాటు వంటగది పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులందరూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్ సౌకర్యంతో పాటు త్రాగునీటి ఆర్.ఓ ప్లాంట్లు ఖచ్చితంగా వుండాలన్నారు. విద్యార్థులు పాఠశాల సమయంలో టాయిలెట్ కొరకు పాఠశాల ఆవరణ దాటి బయటకు వెళ్ళకూడదన్నారు. టాయిలెట్స్ లో రన్నింగ్ వాటర్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సరైన రీతిలో టాయిలెట్ వినియోగం గురించి అవగాహన కలిగిస్తూ పాఠశాలల్లో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.



అలాగే నాడు నేడు పనులకొరకు ఉపయోగిస్తున్న మెటీరియల్, కంకర, ఇటుకలు, రాళ్ళు వంటివి పాఠశాల ఆవరణలో చిందర వందరగా కనిపించకుండ చర్యలు తీసుకోవాలన్నారు. మెటీరియల్ తరగతి గదులలో నిల్వచేసి, పిల్లలను బయట కూర్చోబెట్టడం సరి కాదన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సరిపడే విధంగా గుడ్లు మరియూ చిక్కీల ఇండెంట్ ముందుగానే ఇవ్వాలన్నారు. పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్స్ విద్యార్థులందరూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫామ్ ఇచ్చాక వారం రోజుల్లో కుట్టించుకుని పిల్లలు రెగ్యులర్ గా యూనిఫామ్ తో షూస్, బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా తరగతి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని పిల్లలకు అలవాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పి ఎం శ్రీ పాఠశాలల్లో పి ఎం శ్రీ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి లలిత, పంచాయతీరాజ్ డీఈ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జలసంద్రంగా మారిన ఆత్మకూరు




- పట్టించుకోని ప్రభుత్వాధికారుల
- ప్రజల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతాం
- సిపిఐ కార్యదర్శి టి. ప్రతాప్

**ఆత్మకూర్ రూరల్, పేన్ పవర్,జులై 09:**ఆత్మకూరు పట్టణంలో సోమవారం రాత్రి దాదాపు రెండు గంటలు ఎడతెరప లేకుండా కురిసిన వానకు ఆత్మకూరు పట్టణం లోని లక్ష్మీ నగర్, ఏకలవ్య నగర్, స్వరాజ్ నగర్, సాయిబాబా నగర్ లో గల లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. లక్ష్మీ నగర్ లో గల ఏఐటీయూసీ కేజీ రోడ్డు అమాలి మా భాష ఇల్లు జలమయం కావడంతో చూడడానికి వెళ్లిన సిపిఐ తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్ మాట్లాడుతూ ప్రజలు చాలా దుర్భరమైన జీవితం జీవిస్తున్నారు ఆత్మకూరు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలు నుండి ఈ లోతట్టు ప్రాంతాల్లో మొత్తం సరైన డ్రైనేజీ కాలువలు లేనందువలన ప్రతిసారి వర్షాకాలంలో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఈ బీద ప్రజల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గత ప్రభుత్వం ప్రజలను కేవలం తమ ఓటు బ్యాంకు గాని ఉపయోగించుకున్నారు కానీ ఎటువంటి మంచి చెయ్యలేదు అన్నారు. ఈసారి ప్రభుత్వం మారింది టీడీపీ ప్రభుత్వంలో బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకొని వారిని ఆదుకోవాలి అన్నారు. ప్రతిసారి ప్రభుత్వ అధికారులు వస్తుంటారు చూస్తుంటారు వెళ్తుంటారు కానీ ఈ వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా శాశ్వత పరిష్కారం మాత్రం చూడటం లేదన్నారు. అంతేకాకుండా ఈ వరద నీరు ఇళ్లలో చేరడం వల్ల విషపూరితమైన పాములు, తేళ్లు వస్తున్నాయని పిల్లలు, పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు అన్నారు. ఇది ఇలానే ఎవరికి వారు పట్టించుకోకుండా ఉంటే ఈ లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేస్తామని ఆయన డిమాండ్ చేశారు.





## నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎం.పి డా. బైరెడ్డి శబరి





**పెన్ పవర్, నంద్యాల, జులై 09:**నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా.బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిచారు.

జిల్లా రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు సాగునీరు అందించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమస్య లేకుండా చూడాలని ఎం.పి శబరి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏం. పి శబరి విలేకరులతో మాట్లాడుతూ గత ఇదేళ్ళ వైసీపీ పాలనలో జిల్లాలోని కేసి కెనాల్, తెలుగుగంగా, ఎస్.ఆర్.బి.సి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందించక అనేక కష్టాలు పడ్డారని, పంటలు ఎండిపోయిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, రైతులకు సాగునీరు ఇవ్వలేం అంటూ అధికారుల ద్వారా రైతులకు నోటీసులు ఇచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని శబరి విమర్శించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సహాకారం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరహరి విశ్వనాధ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాకినాడలో జరిగే ఫోటో ఎక్స్ పో విజయవంతం చేయండి



**అనపర్తి,పెన్ పవర్,జులై 9.**ఆగస్ట్ నెల 3, 4 తారీఖుల్లో కాకినాడలో జరిగే ఫోటో ఫిన ఫోటో ఎగ్జిబిషన్ ను విజయవంతం చేయాలని అనపర్తి ఫోటో అసోసియేషన్ ప్రెసిడెంట్ రెడ్డి గోపాలకృష్ణ తెలిపారు.అనపర్తి స్థానిక కళావేదిక వద్ద కాకినాడ ఫోటో ఫీన మెగా ఎక్స్ పో నిర్వాహకులు అనపర్తి యూనియన్ సభ్యులతో కలిసి ఫోటోఫిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గోపి మాట్లాడుతూ నూతన టెక్నాలజీకి సంబంధించిన అత్యాధునిక కెమెరాలు, ఫోటో స్టూడియోలకు అవసరమైన పరికరాలు అక్కడ అందుబాటులో ఉంచేందుకు స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఫోటోగ్రఫీలో నిష్ణాతులైన వారిచే తరగతులు నిర్వహణ జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి అనుబంధ సంస్థలు, లేటెస్ట్ మిక్సింగ్ సంస్థలు నిర్వహణలో భాగం పంచుకుంటున్నారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రెడ్డి గోపాలకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఫోటో ఫీన నిర్వాహకులు అనపర్తి యూనియన్ సభ్యులు నల్లమిల్లి గోపికృష్ణారెడ్డి, మట్టపర్తి మురళీకృష్ణ, సందీప్, ఇమామ్. శ్రీను, షేక్ సలీం. ఏ రమేష్ పాల్గొన్నారు సభ్యులందరూ ఎక్స్ పో ను విజయవంతం చేయాలని కోరారు.

## మొక్కుబడులు చెల్లించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి..





**అనపర్తి,పెన్ పవర్,జూలై 9.**అసెంబ్లీ అభ్యర్థిత్వంపై సందిగ్ధత తొలగాలని గెలుపు రామకృష్ణారెడ్డి వశం కావాలని అనపర్తి మండలం రామవరం అనపర్తి గ్రామాలకు చెందిన భక్తులు మొక్కుకున్న మొక్కుబడులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ఆయా ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

అనపర్తి మండలం కుతుకులూరులో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి 108 కొబ్బరికాయల మొక్కు ను శ్రీనివాసరెడ్డితో కలిసి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని రామకృష్ణారెడ్డి మొక్కుబడి చెల్లించుకున్నారు.

అనపర్తిలో శ్రీ బగళాముఖి అమ్మ వారి దేవస్థానంలో అన్నసమారాధన సందర్భంగా మరియు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధించడంతో బాబా మణికంఠ కొబ్బరికాయల మొక్కు మొక్కుకున్నారు. బాబా మణికంఠతో కలిసి శ్రీ బగళాముఖి అమ్మ వారిని దర్శించుకుని రామకృష్ణారెడ్డి

మొక్కుబడి చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో అనపర్తి టౌన్ ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారి చూపు ప్రజలపై ఉంటుంది

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 9:** రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి దీక్ష పూర్తి చేసుకుని ప్రజల సమస్యలకు పరిష్కారం వెతికే దిశగా పనిచేస్తున్నారని అమ్మవారి చల్లని చూపు ప్రజలపై తప్పకుండా ఉంటుందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నా రు. స్థానిక వానపల్లి గూడెం లో వారాహి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై కూడా ఉండాలని ఆకాంక్షించారు.


## ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.- డివైఎఫ్ఐ



**బండి ఆత్మకూరు, పెన్ పవర్, జూలై 09:** బండి ఆత్మకూరు మండల కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ సమావేశం నిర్వహించారు సమావేశానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న జిల్లా నాయకుడు మధు శేఖర్ లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలని కేంద్రంలోని లక్షలాది ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని అందుకోసం డివైఎఫ్ఐ నిరంతరం పోరాటాల నిర్వహిస్తుందని వారు తెలిపారు .స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని గడగడలాడించి ఉరితాడు ను ముద్దాడిన భగత్ సింగ్, చేగువేరా, అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప నాయకుల ఆశయాల కోసం డివైఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని, దోపిడీ లేని సమాజం సమ సమాజ కోసం యువత ముందుండి పోరాడాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఎన్నికల్లో హామీ ఇచ్చిందని హామీల అమలు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే డివైఎఫ్ఐ యువతను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాముడు, శివ, శ్రీకాంత్ , అంజిత్ , నాగ మల్లయ్య సురేష్ , డాక్టర్ శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. డివైఎఫ్ఐ నూతన మండల కమిటీ ఎన్నిక డివైఎఫ్ఐ మండల అధ్యక్షునిగా మిదుతూరి రాముడు, ఉపాధ్యక్షులుగా పబ్బతి శ్రీకాంత్ కార్యదర్శిగా గడ్డం అంజిత్ సహాయ కార్యదర్శిగా సురేష్ కే శివ 12 మంది కమిటీతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# వికృతమాల ప్రభుత్వ భూమిలో సర్పంచ్ తండ్రి అక్రమంగా నిర్మాణాలు.!



**పెన్ పవర్ – ఏర్పేడు, జూలై 09.**ఏర్పేడు మండలం పారిశ్రామికంగా విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందడంతో మండలంలో భూములకు అమాంతంగా రేట్లు వచ్చాయి. దీంతో అక్రమార్కులు ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ పాగా వేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా పక్కా భవనాలను నిర్మించేస్తున్నారు.. ప్రధానంగా వికృతమాల పంచాయితీ పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. వికృతమాల పంచాయతీలో ఏకంగా నాలుగు పరిశ్రమలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో భూమికి గిరాకీ ఎక్కువ. అక్రమార్కులు ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏకంగా వికృతమాల సర్పంచ్ తండ్రి పక్క భవనాలను నిర్మిస్తున్నారు. వికృతమాల రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 51 లో ఉన్న ఒక ఎకరా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే సర్వేనెంబర్ 97 లో ఉన్న కాలవ పరంబోకు ప్రభుత్వ స్థలంలో సర్పంచ్ తండ్రి నూతనంగా పెద్ద భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆక్రమణల పర్వంలో ఉన్న ఒక్క ఎకరా 60 సెంట్లు భూమి విలువ మూడు కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఎంత జరుగుతున్న అధికారులు మాత్రం ఇటువైపు కన్నీత్తే కూడా చూడడం లేదు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం అటువైపు చూడకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు అయినా స్పందించి ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని వికృతమాల గ్రామస్తులు కోరుతున్నారు..

# ఉచిత ఇసుక విధానంతో పేదవాడి ఇంటి నిర్మాణం సాకారం.




**ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా – నెరవేరుస్తున్న చంద్రన్న ప్రభుత్వం.**

**నూతన ఉచిత ఇసుక విధానానికి జీవో నెంబర్ 43 విడుదల.**

**శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి**

**పెన్ పవర్ – శ్రీ కాళహస్తి.జూలై 09:**రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటంటే మాటేనని ఆయన మాట శిలా శాసనం అని శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం శ్రీ కాళహస్తి పట్టణ తెదేపా కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు బాబు ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెల తిరగకముందే నెరవేరుస్తున్నారని ఆయన తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు 3000 నుండి 4 వేలకు ఒకే విడతగా వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వడమే కాకుండా గత మూడు నెలల బకాయిలను జూలై ఒకటవ తేదీ వాలంటీర్లు లేకుండానే, సచివాలయం సిబ్బందితో పంపిణీ చేసి రికార్డు సృష్టించారన్నారు. మొదటి సంతకం ఐదు హామీలపై చేయగా వరుసగా ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఉచిత ఇసుక పాలసీ కోసం సోమవారం జగన్ రెడ్డి ఇసుక పాలసీని రద్దు చేస్తూ జీవో నెంబర్ 43 ద్వారా పేదల కోసం కొత్త పాలసి విడుదల చేశారని తెలిపారు. ఉచిత ఇసుక విధానం ప్రతి భవన నిర్మాణ కార్మికుడి ఇంట, సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఎదురు చూస్తున్న ప్రతి పేదవాడి ఇంట ఒక పండగ వాతావరణం సృష్టిస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరుల పై హక్కులను ప్రజల పరం చేయడమే లక్ష్యంగా ఈ ఉచిత ఇసుక విధానాన్ని మన ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్జీటీ ఎన్నోసార్లు ఆంక్షలు విధించిన వేటిని లెక్కచేయకుండా అక్రమ రీతిలో ఇసుకను కొల్లగొట్టారని ఆయన మండిపడ్డారు. ఉచిత ఇసుక పాలసీ ద్వారా రాష్ట్రం ప్రగతి బాటలో నడుస్తుందని పేదల సొంతింటి కల నెరవేరుతుందని నిర్మాణరంగం ఊపందుకుంటుందని తెలిపారు. ఇసుక కొత్త పాలసీ తీసుకురావడం అభినందనీయం అన్నారు. దీని ద్వారా సామాన్యులకు భారీ ఊరట లభిస్తుందని తెలిపారు. ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో నూతన విధానం పారదర్శకత ముందుచూపుతో ఇసుక పాలసీని రూపొందించడం జరిగిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 50 వేల కోట్ల రూపాయలు ఇసుక ద్వారా కొల్లగొట్టారన్నారు. ఇల్లు కట్టుకునే పేదవానికి ఇంటి నిర్మాణంలో ఇసుక కోసం అధికంగా మూడు లక్షలు ఖర్చు అయ్యేదని తెలిపారు. పేదల కోసం అంటు గృహ నిర్మాణం పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసారని తెలిపారు. జగన్ బినామీ సంస్థ జెపి వెంచర్స్ చెల్లించాల్సిన 800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. వైసిపి మాఫియా మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక పాలసీ విధానం వల్ల అక్రమ ఇసుక తవ్వకాలు నిరోధించడం తోపాటు విజిలెన్స్ పర్యవేక్షణ సుప్రీం కోర్ట్ హై కోర్ట్ ఎన్ జి టి నిబంధనలకు అనుగుణంగా పర్యావరణం దెబ్బతినకుండా రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో స్టాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఆర్డిఓ మైనింగ్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. నూతన విధానంలో ఇసుకను తిరిగి అమ్మిన ఇతర రాష్ట్రాలకు తరలించిన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఉచిత ఇసుకను భవన నిర్మాణాలకు మాత్రమే వాడాలన్నారు. ఇప్పటివరకు కుదేలైన భవన నిర్మాణ రంగం ఇకపై పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలం, పెన్ పవర్, జులై 09:**శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా మంగళవారం ఎల్. శ్రీనివాస్ మరియు వారి బృందం, వారి శివనామ సంకీర్తన కార్యక్రమం మల్లన్న భక్తులను ఆకట్టుకుంది. వినాయకస్తుతి, పార్వతీనందన, శంభో శంకరా శివశంభో శంకరా, శివనామమే నా గానం, సాంబసదాశివ, పరమశివా ఓ పరమశివా, కైలాసపతే సదాశివా, గిరిజా రమణాదురిత నివారణ, శంకరా సదాశివా సభాపతే, శివశివ భవభవ శరణం, గంగాధర గౌరీ మనోహార మొదలైన పలు భక్తిగీతాలు, అష్టకాలను అచంట లక్ష్మీ శ్రీనివాస్, నూకల యజ్ఞ నారాయణ శర్మ, ఎ.ఎస్.ఆర్ మూర్తి, ఆర్.ఎస్.ఎన్. రాజు, కె.వి. రమణ, వీరపందు, నూకరాజు, వినయ్ కుమార్, గౌరీవర ప్రసాద్ తదితరులు ఆలాపించారు.

# పేద రజకులకు ఇంటిస్థలాలను మంజూరు చేయాలి

**ఏపి రజక ఎస్సీ సాధన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు రజక**



**పెన్ పవర్, నంద్యాల, జులై09:**నంద్యాల పట్టణంలోని నిరుపేద రజక కుటుంబాలకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ఏపి రజక ఎస్సీ సాధన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు రజక డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని స్థానిక ఫరూక్ నగర్, గుడిపాటిగడ్డ ప్రాంతాలలో నివసిస్తున్న రజకులు ఐకమత్యంతో చిన్నచెరువు కట్టవద్ద వర్షాలు బాగా కురుసి పంటలు బాగ పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఏపి రజక ఎస్సీ సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో మంగళ వారం గంగమ్మ జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్న శ్రీనివాసులు, వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు రజక హాజరైయ్యారు. అనంతరం నందవరం శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా, నియోజక వర్గంలో ఎందరు ప్రజా ప్రతినిధులు మారినా రజకుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ళలో రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఒక్కరూపాయి నిధులు కేటాయించక పోవడం వల్లనే వైఎస్ జగన్ కు గుణపాఠం చెప్పారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక సామాజిక వర్గం 90% శాతం తెలుగుదేశం పార్టీకి అండగా వున్నారని తెలిపారు. కాబట్టీ స్వర్ణాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి నిరుపేద, రజక కుటుంబాలకు ఇంటి స్తలాలను, 50 సంవత్సరాలకు ఎన్టీఆర్ భద్రతా పింఛన్లు, నిరుద్యోగ భృతిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిదంగా,స్థానిక నియోజక వర్గంలోని న్యాయ శాఖ మంత్రి వర్యులు ఎన్.ఎం.ఫరూక్ స్పందించి రజక సామాజిక వర్గం సంక్షేమం పై దృష్టి పెట్టాలని కోరారు. కుందూ,చామకాలువ,చిన్నచేరువు కట్టవద్ద ఉన్న పరివాహక ప్రాంతాల్లో దోభి ఘాట్లు, నంద్యాల జిల్లా స్థాయి లో రజక కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మద్దిలేటి, ఆంజనేయులు, హనుమంతు, శ్రీనివాసులు, సి.మధు, నాగప్ప, బల్పనూరు మద్దిలేటి, జి. మధు తదితరులు పాల్గొన్నారు .

## యూపీ స్కూళ్లలో 9,10 తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి -ఏఐఎస్ఏ



**ఆత్మకూర్ , పెన్ పవర్ 09:** విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి– ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ యూపీ స్కూళ్లలో హై స్కూల్ సెక్షన్ 9,10 తరగతులు నిర్వహిస్తున్న ఆదిత్య,కేరళ మోడల్,అలెక్స స్కూల్ లపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ 1 బాలాజీ నాయక్ ఎంఈఓ 2 సురేష్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నుండి కేవలం అప్పర్ ప్రైమరీ స్కూల్ మాత్రమే అనుమతులు కలిగి హై స్కూల్ సెక్షన్ 9,10 తరగతిలో పర్మిషన్ లేకున్నా కూడా తరగతులు నిర్వహిస్తున్న ఆదిత్య,కేరళ మోడల్,అలెక్స పాఠశాలలను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 9,10 తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ..విద్యార్థులను,తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఈ విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ గా డిమాండ్ చేశారు. అంతేకాకుండా సరైన వసతులు తాగునీరు, శానిటరి, సౌండ్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్,పార్కింగ్ స్థలం బాత్రూం, క్రీడా మైదానం, మున్సిపల్, ఫైర్ పర్మిషన్ అనుమతులు లేకుండా లైబ్రరీ, క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ లేకుండా కనీసం విద్యార్థులకు సరిపడా గదులు లేకుండా రేకుల షెడ్లలో విద్యను బోధిస్తూ కాలక్షేపం చేస్తూ విద్యార్థుల నుండి వేల వేలు ఫీజుల దోపిడీ చేస్తున్నారని కావున తక్షణమే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసా జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధన్ పాల్గొన్నారు.

## సిద్దాపురం లిఫ్ట్ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలి



**ఆత్మకూర్ , పెన్ పవర్ 09:** సిద్దాపురం ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు మా భాష, వీరన్నలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు పంటలు సాగు చేసుకుంటూ సరైన సమయానికి సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలియజేశారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక అప్పులు చేసుకొని ఆత్మహత్యలకు గురవుతున్నారని తెలిపారు. రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లు ఇవ్వాలన్నారు. ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, పెట్రోల్, డీజిల్ రవాణా చార్జీల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. దేశానికి రైతే వెన్నెముక అంటూనే వెన్నెముక విరిగిపోయేలా ప్రభుత్వాలు భారాలు వేస్తున్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ భవనాలు ఏర్పాటు చేయాలి-భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ



**ఆత్మకూర్,పెన్ పవర్ 09:** ఆత్మకూరు పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ బాలుల వసతి గృహాన్ని మంగళవారం విద్యార్థి సంఘ సభ్యులు విజిట్ చేసి .అక్కడ ఉన్నటువంటి విద్యార్థి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నటువంటి పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా స్నానం గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. అదే విధంగా కుక్కు, కమాట్టీ ,వర్కర్స్ .ని కూడా ఏర్పాటు చేసి.హాస్టల్ విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలని వారు అన్నారు. అదేవిధంగా ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్నటువంటి కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూర్ ఎస్సీ ఎస్టీ బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ సంత భవనాలు ఏర్పాటు చేసి హాస్టల్లో కాళీ ఉన్నటువంటి పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్నటువంటి మెస్ ఛార్జీలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఉన్నతాధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. ఇప్పుడైనా హాస్టల్ విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టి ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ సొంత భవనాలు ఏర్పాటు చేసి పెండింగ్లో ఉన్నటువంటి మేస్చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి ,దిలీప్ ,లింగేష్, రాజు, బాబు, రవి ,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కి విశేష అభిషేకం

**శ్రీశైలం, పెన్ పవర్, జులై 09:** అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించారు ఆలయ అధికారులు.

ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగి పోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది.

ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతిపూజ జరిపించిన అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్య స్తోత్రము పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పళ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.




## చియ్యవరం పంచాయతీ లో విద్యార్థిని,విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన బొజ్జల రిషితా రెడ్డి.





**పెన్ పవర్ - తొట్టంబేడు,జూలై 09.** తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామ పంచాయతీలో చియ్యవరం యువత స్వచ్ఛందంగా వారి సొంత ఖర్చులతో హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు, అంగన్వాడీ పిల్లలకు పుస్తకాలు, పెన్సిల్లు,పెన్నులు బొజ్జల రిషితారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసారు. మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, మహిళలు, మండల నాయకులు కర్పూర హారతులతో బొజ్జల రిషితా రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ స్వామి గుడిలో పూజలు చేసి ఉపాధ్యాయని, ఉపాద్యాయులు, సచివాలయ సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రీషితారెడ్డి మాట్లాడుతూ విద్యా సామాగ్రి అందజేసిన చియ్యవరం యువతకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చింతపట్ల భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ రామయ్య, మాజీ పాల సొసైటీ చైర్మన్ రావిళ్ళ మునిరాజా నాయుడు, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు సాలి రాజా, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, జనసేన పార్టీ అధ్యక్షులు విజయ్ భాస్కర్, శంకరయ్య, వెంకటేష్, నరసింహులు, బాలాజీ, దామోదరం, వేమాలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బయలు వీరభద్రస్వామి కి ప్రదోషకాల అభిషేకం



**శ్రీశైలం, పెన్ పవర్, జులై 09:** లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం మంగళవారం సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీ బయలు వీరభద్రస్వామి కి విశేషపూజలను జరిపించింది.

ప్రతీ మంగళవారం మరియు అమావాస్య రోజులలో బయలు వీరభద్రస్వామి కి ఈ విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించబడుతున్నాయి.

బయలు వీరభద్రస్వామి వారు శివభక్తగణాలకు అధిపతి. అదే విధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ప్రారంభంలో ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలు వీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట ముకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపులో కుడివైపున దక్షుడు, ఎడమవైపున భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలిగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి.

ముఖ్యంగా ఆగమ సంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడు పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయబాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.

ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

# నందీశ్వర స్వామి కి విశేష పూజలు



**శ్రీశైలం, పెన్ పవర్, జులై 09:** లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం మంగళవారం ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించింది.


ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోష కాలంలో అనగా సాయం సంధ్యా సమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది.

ఈ విశేషార్చనలో ముందుగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతి , సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరిగింది.



అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజను జరిపించిన తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించి, వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగింది. తరువాత నందీశ్వరస్వామి కి నూతన వస్త్ర సమర్పణ, విశేష పుష్పార్చనలను చేశారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగింది. చివరగా స్వామికి నివేదన సమర్పించారు.

## శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం



**శ్రీశైలం,పెన్ పవర్, జులై 09:** భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నవితరణ పథకానికి మంగళవారం హైదారాబాద్ కు చెందిన కె. వినోద్ కుమార్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందు కు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతకు శ్రీ స్వామి అమ్మవార్ల శేష వస్రాలను, ప్రసాదాలను ఇచ్చి సత్కరించారు.

## శ్రీశైల భ్రామరికి సారె సమర్పణ





**శ్రీశైలం పెన్ పవర్ జులై 09:** ఆషాఢమాసం సందర్భంగా శ్రీశైలంలో మంగళవారం శ్రీ కృష్ణ దత్తసాయి సేవాసమితి అధ్యక్షురాలు శ్రీమతి సాహితీరెడ్డి ఆధ్వర్యంలో సమితి సభ్యులు మరియు శివసేవకులు మొత్తం 200 మంది భక్తులు శ్రీ భ్రమరాంబాదేవికి సారె సమర్పించారు.

ఈ సమర్పణలో పసుపు, కుంకుమ, పలు రకాల పూలు, పండ్లతో సారెను సమర్పించారు. అలాగే శ్రీ మల్లికార్జునస్వామి కి, బయలు వీరబద్రస్వామి కి, సాక్షిగణపతి స్వామి కి, పలు ఉపాలయాల దేవతామూర్తులకు వస్త్రాలను కూడా సమర్పించారు.

## ఆదిత్య విద్యార్థుల హవా



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 9:** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో టెక్ మహీంద్రా ప్రాంగణ నియామకాలు జరిగాయని ప్రిన్సిపాల్ లక్ష్మీ సరోజ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, ఏలూరు కళాశాలల నుండి సుమారు 200 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ డ్రైవ్ లో టెక్ మహీంద్రా కు చెందిన నలుగురు హెచ్ఆర్ లు పాల్గొన్నారు. విద్యార్థులకు

వివిధ రంగాలకు చెందిన సబ్జెక్టులపై ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో 50 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. బుధవారం కూడా వివిధ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని హెచ్ ఆర్ లు తెలిపారని ప్రిన్సిపాల్ సరోజ చెప్పారు. పటిష్టమై న విద్యా ప్రణాళికలో భాగంగా తాము అందించే సాఫ్ట్ స్కిల్స్, సి ఆర్ టి శిక్షణ, కోడింగ్ లో సర్టిఫికేషన్స్ వల్ల తమ విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో ఇలాంటి ఉద్యోగ మాంద్య క్లిష్ట పరిస్థితులలో కూడా 500 పైగా ఉద్యోగాలు కైవశం చేసుకున్నారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఆదిత్య అంటేనే ఉద్యోగాలని తమ విద్యార్థులు మరోసారి నిరూపించారని కళాశాల డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థలు ఛైర్మన్ శేషారెడ్డి, సెక్రటరీ సుగుణా రెడ్డి విద్యార్థినీ, విద్యార్థు లను అభినందించారు.